# అదే పాలన - అదే విధ్వంసం

*"ప్రకృతిని ఉన్నదున్నట్టు ఉండనిచ్చివుంటే మానవ నాగరికత ఇంత దూరం వచ్చి ఉండేదే కాదు. అయితే జీవనం పొందడానికీ జీవన అవకాశాలను విస్తృత పరచడానికీ ప్రకృతిని వస్తువుగా వినియోగించుకోవడం వేరు, సుఖమయ జీవితం తప్ప తక్కిన అన్ని ప్రమాణాలనూ లక్ష్యాలనూ కోల్పోయి ప్రకృతినీ పరిసరాలనూ మనకు సుఖమిచ్చే వస్తువులుగా భావించడం వేరు. నాగరికత ఎక్కడో ఒకచోట గిరిగీసి ఆ రేఖకు ఆవల ప్రకృతి ఉనికితో ఆడుకోరాదని నిర్ణయించుకోవడం అవసరం"  – బాలగోపాల్*




గత రెండు దశాబ్దాలుగా ఒక అభివృద్ధి నమూనా దేశంలో చెలామణీలోకి వచ్చింది. ఎన్నికల వేళ ఉప్పూ-నిప్పూగా ఉండే రాజకీయ పక్షాలన్నీ ఈ నమూనా అమలుకొచ్చేసరికి ఒకే తాను జెండా లయ్యాయి.

అభివృద్ధి అంటే ఏమిటీ అని వీళ్ళని అడిగితే మూడు విమానాశ్రయాలు, ఆరు ఒడరేవులు, డజను రసాయన పరిశ్రమలూ వీటన్నింటినీ కలిపే నల్లత్రాచుల్లాంటి నాలుగు నాలుకల హైవేల వంక చూపుతారు. అందుకోసం పచ్చని పంట భూములను వదులుకొమ్మని రైతులకు సెలవిస్తారు. సముద్రతీరం నుంచి గంగపుత్రులను విడదీస్తారు.

అంతేకాదు, పేదలకిచ్చే సబ్సిడీలు దండగమారివంటారు. ప్రాజెక్టులలో నీళ్ళే తప్ప మునిగే ఆదివాసీ ఊళ్ళు వారికి కనపడనే కనపడవు. సమాజంలో పేరుకుపోయిన సామాజిక, ఆర్థిక అంతరాలు పూడ్చే బదులు అమెరికాకు, అమరావతికి మధ్య అగాధాన్ని తగ్గించే ప్రయత్నాలు చేసుకుంటూ పోతారు. అంతోఇంతో ఈ అభివృద్ధి భావజాలం అంటుకున్న వాళ్ళ జాబితాలో మనమూ చాలా మందిమే ఉన్నాం. ఈ అభివృద్ధి భావన అసలు ఉద్దేశ్యాల్ని పసిగట్టి, తెలుగునేల నాలుగుచెరుగులా తిరిగి ఈ ప్రగతి పదఘట్టనలకింద నలిగిపోయిన బడుగుజీవుల ఆక్రందనలను బాలగోపాల్ తన రిపోర్టులలో, వ్యాసాలలో వినిపించారు. మానవ హక్కుల వేదిక ఆయన రచనలను 'అభివృద్ధి – విధ్వంసం' పేరిట ప్రచురించింది. ఈ పుస్తక పరిచయ సభకు అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం.

## సభ

| | | |
|---|---|---|
| **స్థలం** | : | బిల్డర్స్ అసోసియేషన్ హాల్, సిరిపురం, విశాఖపట్నం |
| **తేది** | : | నవంబర్ 1, 2015 (ఆదివారం) ఉదయం 10 గం॥లకు |
| **వక్తలు** | : | ఇ.ఎ.ఎస్. శర్మ, భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి<br>ఎన్.ఎస్. శ్రీనివాసరావు, మానవ హక్కుల వేదిక |

27-10-2015

**మానవ హక్కుల వేదిక**
Human Rights Forum (HRF)
విశాఖ జిల్లా

## ఇందులో...

"బడుగువర్గాల జీవితాలు బాగుపడడాన్ని మనం ఇంకా 'అభివృద్ధి'గా అర్థం చేసుకోవడం లేదు. సంక్షేమంగా మాత్రమే అర్థం చేసుకుంటున్నాం. 'అభివృద్ధి' ఆదాయాన్ని తెచ్చిపెడితే 'సంక్షేమం' ఖర్చును పెంచుతుందని చెప్పి దానిని ఒక కంట కనిపెట్టి ఉంచాలనుకుంటాం. చవక బియ్యం, ఉచిత కరెంటు, ఎస్.సి, బి.సి. స్కాలర్‌షిప్‌లు, వికలాంగులకు బస్‌పాసులు, ఇవన్నీ ప్రభుత్వానికి ఖర్చు పెంచే సంక్షేమ చర్యలు అనుకుంటాము కాబట్టి వీటికొక సీలింగ్ పెట్టి అంతకంటే ఎక్కువ అడగొద్దనీ ఇవ్వొద్దనీ అంటాం. అదే వెడల్పయిన రోడ్లు, టెలికాం లైన్లు, పర్యాటక కేంద్రాలు- ఇటువంటివయితే 'అభివృద్ధి'కి సంబంధించిన విషయాలనీ, వాటిపైన ఎంత ఖర్చు పెట్టగలిగితే అంత మంచిదనీ అనుకుంటాం. కానీ నిజానికి'సంక్షేమం' అనేది ఎంత 'అభివృద్ధో' గ్రహించినట్లయితే ఈ విషయాలు గురించి మనం చర్చించే పద్ధతే మారిపోతుంది. ప్రభుత్వ ఖజానా, ప్రైవేట్ బ్యాంక్ అకౌంట్లకూ పెట్టుబడులను వేగంగా జమ చేసేది మాత్రమే అభివృద్ధి కాదనీ, ప్రజల జీవితాలను బాగుపరిచేదీ అభివృద్ధే అనీ గ్రహించే రోజు ఎప్పుడొస్తుందో.."

"...భూములు లేని వాళ్లు, చాకలివాళ్లు, మంగలివాళ్లు, వ్యవసాయ కూలి చేసుకునేవాళ్లు, ఏమైపోతారు వాళ్ళంతా? వాళ్లను బికారులుగా మార్చి, విశాల ప్రజానీకానికి జీవనాధారమైన ప్రకృతిని పెట్టుబడికి ఒక వనరుగా చూడటం అనేది దుర్మార్గమైన ఆలోచన. అదే పెద్ద దోపిడి"

"అమెరికా వంటి దేశాల తలసరి వినియోగం ప్రపంచంలో అందరూ పొందాలంటే ఈ నేల, గాలి, నదీనదాలు, సముద్రాలు తట్టుకోలేవు"

"మానవీయమైన జీవన ప్రమాణం మనుషులందరి హక్కుఅనీ సమాన అభివృద్ధి అవకాశాలు అందరి హక్కు అనీ భావించేటప్పుడు అవి కొరవడిన మేరకు ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వడం అవసరం. కానీ ఆ జీవన ప్రమాణం అందుబాట్లో ఉండడానికి మొదటి అవసరం జీవనానికి అవసరమయిన వనరులు ప్రజలకు అందుబాట్లో ఉండడం"

"భూసంస్కరణలకు కాలం చెల్లిందని ఎవరన్నారు? కాకపోతే, భూస్వాముల భూములు తీసి పేదలకిచ్చే బదులు పేదల భూములు తీసి ధనవంతులకిస్తున్నారు - అంతే తేడా".

- బాలగోపాల్

**బాలగోపాల్ రచించిన 'అభివృద్ధి- విధ్వంసం' పుస్తక పరిచయ సభ**